క్లుప్తంగా

బతుకమ్మ సంబురాలు

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబురాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులు, విద్యార్థినులు కలసి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, అమ్మవారికి పూజలు చేశారు. బతుకమ్మలను ఎత్తుకుని ఆటపాటలతో నృత్యాలు చేశారు. సందర్భంగా ప్రిన్సిపాల్ తోలెం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ ఉత్సవాలను జరుపుకుంటున్నామని తెలిపారు. సంబురాల్లో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమణ, శ్యామల, కాంతమ్మ, అనూష, రజనీ, సరస్వతి, సత్యావతి పాల్గొన్నారు.

బూత్ కమిటీల సమావేశం

చర్లరూరల్: చర్ల మండల బీఆర్‌యస్ పార్టీ కార్యాలయంలో బుధవారం బూత్ కమిటీల నియామక సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సోయం రాజారావు మాట్లాడుతూ.. ప్రతీ బూత్ కమిటీ సభ్యులు వారికి కేటాయించిన వందమంది ఓటర్లను క్రమం తప్పకుండా కలుస్తూ సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను నిత్యం ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి లంకరాజు, ఎంపీపీ కోదండ రామయ్య, చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, ఇర్సవడ్ల రాము, దొడ్డి సూరిబాబు, తోటమళ్ళ వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా కిట్లు పంపిణీ

దుమ్ముగూడెం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బైరాగులపాడు గ్రామంలో ఫైలేరియా బాధితులకు డాక్టర్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఫైలేరియా కిట్లను పంపిణీ చేశారు. కిట్లను వాడుకునే విధానం గురించి వ్యక్తుల వారీగా వివరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ హనుమంతు, హెల్త్ అసిస్టెంట్ ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారం

మణుగూరుటౌన్: ప్రజల అభివృద్ధిని కాంక్షించి ఇచ్చిన హామీని నిలబెట్టుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జయశంకర్ నగర్, గుట్టమల్లారం ఏరియాల్లో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో 85 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా.. పాయం వెంకటేశ్వర్లు వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పుచ్చకాయల శంకర్, తరుణ్‌రెడ్డి, వెంకట్రావ్ గౌడ్, బాజీ, సుబ్బారెడ్డి, పాతూరి వెంకన్న, చింతల కృష్ణ, జగన్, మధు, పాల్వంచ రాములు, పాషా తదితరులు ఉన్నారు.

పార్టీలో చేరిక..

చర్ల: మండలంలోని చీమలపాడులో బుధవారం పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ ఆహ్వానించారు. నాయకులు ఎంపీటీసీ మడక పద్మ, ఉప్పరిగూడెం సర్పంచ్ ఎలకం నరేంద్ర, చర్ల ఉప సర్పంచ్ శిరిపురపు శివ, యూత్ కాంగ్రెస్ నాయకులు సాయిచరణ్, బోరా పెద్దిరెడ్డి, బాలు పాల్గొన్నారు.

హరిత రక్షణ అందరి బాధ్యత

మణుగూరురూరల్: హరితరక్షణ మనందరి బాధ్యత అని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక కళాశాలలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో హరిత పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలన్నారు. హరిత రక్షణ, శక్తి ఆదా, పర్యావరణ పరిరక్షణ అంశాలలో తమ కళాశాలకు ఏ ప్లస్ గ్రేడ్ వచ్చినట్లు తెలిపారు. నాణ్యమైన విద్య, సామాజిక అంశాలు, పర్యావరణ పరిరక్షణలో తమ కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలు చిరస్మణీయం

భద్రాచలంటౌన్: ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిన నాగటి నారాయణ సేవలు చిరస్మణీయం అన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు అన్నారు. పట్టణంలోని యుటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం నాగంటి నారాయణ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఉద్యమాల్లో నారాయణ తనదైన ముద్రను వేశారని అన్నారు. కిషోర్ సింగ్, మురళి, లక్ష్మీనారాయణ, జగపతి, చలం, భూషణరావు, మోహన్ రావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ ఆయా మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీలోని గరిబడ్డు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా పూసం కాంతమ్మ(65) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. కాంతమ్మ మృతదేహానికి సర్పంచ్ కాకా అశోక్, ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ, అంగన్‌వాడీ టీచర్లు సుమతి, కరుణ, మంగతయారు, సక్కుబాయి నివాళులు అర్పించారు.

‘భవిత’కు భవనం లేదు..

- తాత్కాలిక కేంద్రాల్లో దివ్యాంగులకు చికిత్స
- ఒక్కో ట్రీట్‌మెంట్‌కు ఒక్కో ప్రదేశం..
- దూరాభారంతో ప్రజలకు ఇక్కట్లు
- ఒకే ప్రదేశంలో సొంత భవనం ఏర్పాటుకు డిమాండ్



లక్ష్మీనగరం సీఎస్ఐ పాఠశాలలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు

దుమ్ముగూడెం: మూగ, చెవిటితో పాటు ఇతర శారీరక లోపంతో జన్మించిన చిన్నారుల సంరక్షణకు మండలంలో చేపట్టే భవిత కార్యక్రమానికి భవనం లేకుండాపోయింది. ఈ కార్యక్రమంలో భాగంగా దివ్యాంగ పిల్లలను ప్రతీ రోజు కేంద్రాల్లో ఫిజియో, స్పీచ్ థెరపీ చికిత్స అందించాల్సి ఉంది. కానీ సొంత భవనం లేక పోవడంతో మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో వారానికో చోట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీంతో దివ్యాంగులకు మెరుగైన సేవలు అందడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

భవిత కార్యక్రమంలో భాగంగా మానసిక వైకల్యం, వినికిడి లోపం, శారీరక వైకల్యం, జన్యుపర లోపాలతో పుట్టిన వారు, అంధులు తదితర సమస్యలతో సతమతమవుతున్న వారి వివరాలను 40 కాలమ్‌లలో పొందుపరుస్తున్నారు. 21 రకాల సమస్యలతో బాధపడుతున్న వారిని జాబితాలో చేరుస్తారు. వీరికోసం ఐఈఆర్‌సీ కేంద్రాల్లో నిపుణలతో శిక్షణనిస్తారు. ఆటపాటలతో చిన్నారులకు విద్య అందిస్తారు. పిల్లల్లో మార్పురాగానే సాధారణ పాఠశాలల్లో చేర్పిస్తారు. కానీ ఈ కార్యక్రమాలన్నీ సక్రమంగా జరగడానికి ఓ ప్రాంతం లేదా భవనం ఉండాలి. సమస్య ఇక్కడే వచ్చింది.

తాత్కాలిక కేంద్రాలు..

మండల వ్యాప్తంగా శారీరక వికలాంగులు 200 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికోసం సొంత భవనం లేకపోవడంతో తాత్కాలిక భవనాల్లో చికిత్సలు అందిస్తున్నారు. అదికూడా అందుబాటులో ఉన్నదాన్ని బట్టి ఒక్కో కార్యక్రమాన్ని ఒక్కో చోట చేపడుతున్నారు. లక్ష్మీనగరం సీఎస్ఐ పాఠశాలలో ఫిజియోథెరపీ కేంద్రం ఉంటే.. ఐఈఆర్‌సీ తాత్కాలిక కేంద్రాలు మారాయిగూడెం, సీతారాంపురం గ్రామాల్లో ఉన్నాయి. వేరువేరు ప్రాంతాలు అవడంతోపాటు, ఇలా ప్రభుత్వ పాఠశాలలో కేంద్రాలను నిర్వహించడం వల్ల బడి ఉన్న సమయంలో అటు విద్యార్థులకు, ఇటు దివ్యాంగులకు అసౌకర్యంగా మారుతోంది.

వేర్వేరు కేంద్రాలతో ఇబ్బంది

మా అబ్బాయికి ఫిజియోథెరఫీ చేయించడానికి రేగుబల్లి నుంచిలక్ష్మీనగరం గ్రామం వస్తున్నాం. అలాగే సమ్మేళిత విద్యాకేంద్రం సీతారాంపురం, మారాయిగూడెంలో ఉండటంతో అక్కడికి కూడా వెళ్లాల్సి ఉంటుంది. ఒక దగ్గర కేంద్రం లేకపోవడంతో ఇలా దివ్యాంగ పిల్లలను గ్రామగ్రామం తిప్పాల్సి వస్తోంది. దీంతో ఆర్థికంగా భారం అవుతోంది.

– విజయలక్ష్మి, జడ్ రేగుబల్లి

దూరాభారం..

మా అబ్బాయికి ఫిజియోథెరపీ చేయించడానికి చెరుపల్లి గ్రామం నుంచి లక్ష్మీనగరం గ్రామం రావడానికి సుమారు 23 కిలో మీటర్ల దూరం ఉంటుంది. అక్కడి నుండి పిజియోథెరఫి రోజు ఎన్ని పనులు ఉన్నా ఆరోజు మానేసి ఇక్కడకు రావాల్సి ఉంటుంది. అన్ని గ్రామాలకు అందుబాటులో ఉండే ప్రదేశంలో సొంతభవనాన్ని నిర్మిస్తే బావుంటుంది.

– శ్రీను, చెరుపల్లి

ప్రతిపాదనలు పంపించాం..

మండలంలో భవితకు భవనం ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. జిల్లాల్లో ఇప్పటికే 6 కేంద్రాలు నడుస్తున్నాయి. త్వరలోనే మండలానికి భవనం మంజూరు అయ్యే అవకాశాలు ఉన్నాయి. సిబ్బంది కూడా నిత్యం అందుబాటులో ఉంటూ దివ్యాంగ విద్యార్థులకు సేవలను అందిస్తున్నారు.

– సైదులు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్

ఆధారాలు లేకుంటే డబ్బు సీజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మంగీలాల్, పక్కన ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లే వారు ఖచ్చితంగా ఆ నగదుకు సంబంధించిన వివరాలు దగ్గరుంచుకోవాలని, లేదంటే ఆ నగదును గానీ, బంగారాన్ని గానీ సీజ్ చేస్తామని ఏఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున కొనసాగుతున్న తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి ఆయన సూచించారు. భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఏఎస్పీ బుధవారం పట్టణ సీఐ నాగరాజుతో కలిసి సందర్శించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన నాలుగు చెక్ పోస్టుల వద్ద 24 గంటలు కొనసాగే తనిఖీల్లో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తనిఖీల్లో ఎస్సైలు మధు ప్రసాద్, వీఎస్ రావు, విజయలక్ష్మి, ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

భద్రాచలంటౌన్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉండడంతో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్, ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికల సన్నద్ధ సమావేశంలో వారు అధికారులుకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారం

అశ్వాపురం: బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో బుధవారం గడప గడపకు బీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అమరేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రచారం చేస్తూ రేగా కాంతారావు గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మామిడి శ్రీను, యువజన నాయకులు ఈసంపల్లి పున్నారావు, మందా హుస్సేన్, కడారి వేణు, గొడ్డుగుర్ల వెంకన్న, జినక ప్రభాకర్, మంద్రు నరసింహారావు, దాసరి రాజా, నవీన్, హుస్సేన్, జగన్నాథం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

చర్లరూరల్: భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి బీఆర్‌యస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ చర్ల మండల అధ్యక్షుడు సోయం రాజారావు అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌డీ.అజీజ్, గొర్ల రాజబాబు, కాకి అనిల్, జనార్దన్, నాగరాజు, కృష్ణార్జునరావు, బోళ్ళ వినోద్, గణేష్, సిద్ధి సంతోష్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పంజా రాజు తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..



పార్టీలో చేరినవారికి కండువా కప్పుతున్న ఎంపీ కవిత, పక్కన ఎమ్మెల్సీ మధు

భద్రాచలంటౌన్: ప్రజ సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిన సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. భద్రాచలం పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భద్రాద్రి అభివృద్ధి ఇక్కడి ప్రజల చేతుల్లోనే ఉందని భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావ్‌ని గెలిపించి అభివృద్ధికి బాటలు వేసుకోవాలని అన్నారు. అనంతరం పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావ్, కోనేరు చిన్ని, సిద్దులు, తిరుపతిరావు, కృష్ణమూర్తి, భవాని, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: విప్ రేగా

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ.. బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయితీలో ఉన్న పద్మశాలి భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆయన విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిపై ప్రచారం నిర్వహిస్తూ.. పార్టీ గెలుపునకు పాటుపడాలని అన్నారు. సమష్టి కృషితోనే బీఆర్ఎస్ గెలుపు సాధ్యమని అశారు. అలాగే పార్టీ మండల నాయకులు, కార్యకర్తలో సమావేశమైన ఆయన మాట్లాడారు. పట్టణంలో కాంగ్రెస్‌కు చెందిన 20 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అడపా అప్పారావు, ముత్యంబాబు, నాయకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

దుమ్ముగూడెం: మండలంలో ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన బాధితుడికి ఎస్సై గణేష్ బుధవారం అందజేశారు. మండలానికి చెందిన మేకల సర్వేశ్వరావు తన ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి అందజేశారు.

13న సదస్సు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని గిరిజన అభ్యుదయ భవన్‌లో ఈ నెల 13న జరిగే మాల మహానాడు జిల్లా సదస్సును జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజ్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సదస్సుకు జాతీయ అధ్యక్షుడు ఎర్రమల్ల రాములు, రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

వైద్యశిబిరం

చర్లరూరల్: ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని చర్ల మండలంలోని చెన్నాపురం గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని 65 మందికి వైద్య పరీక్షలు వారికి కావలసిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్, యల్‌టీ రవి, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బారావు, వరప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు పార్వతి, సంధ్య, దీప్తిలు పాల్గొన్నారు.

దోమలమందు పిచికారీ

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని మహాదేవపురం గ్రామంలో రెండో విడత దోమలమందు పిచికారీ బుధవారం చేపట్టారు. డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దోమల మందును తమ ఇళ్లల్లో పిచికారి చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది బాబురావు, వీరమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

సార్లు డుమ్మా.. విద్యార్థులు ఇంటికి!



ఉపాధ్యాయులు లేకపోవడంతో ఖాళీగా కూర్చున్న విద్యార్థులు

దుమ్ముగూడెం: మండలంలోని సుబ్బారావుపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు కాకపోవడంతో విద్యార్థులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ పాఠశాలలో ఉన్నదే ఇద్దరు ఉపాధ్యాయులు.. వీరిద్దరు ఉదయం నిర్దత సమయానికి రాకపోవడంతో పంచాయతీ కార్మికుడు పాఠశాల తలుపులు తెరిచాడు. ఒక్కొక్కరిగా చేరుకున్న విద్యార్థులు.. కాసేటివరకు పాఠశాలలలోనే కూర్చున్నారు. ఎంతసేపటికీ ఉపాధ్యాయులు రాకపోవడంతో బోధించేవారు లేక ఇళ్లకు వెళ్లిపోయారు.

అంతర్గత వివాదాల మూలంగానే..

పాఠశాల హెచ్‌ఎం తిరుపతిరావు, ఉపాధ్యాయుడు మోహన్‌ల నడుమ గత కొంతకాలంగా వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఇరువురి వివాదంపై సర్పంచ్ చిన్నారావు గతంలోనే ఎంఈఓ సమ్మయ్యకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికారులు ఈ వివాదంపై దృష్టి పెట్టకపోవడంతో వివాదం మరింత ముదిరింది. ఈ క్రమంలోనే ఇరువురు ఉపాధ్యాయులు పాఠశాల విధులకు గైర్హాజరయ్యారని సర్పంచ్ వర్షా చిన్నారావు మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కాంప్లెక్స్ హెచ్‌ఎం ఏవీ.రామారావును వివరణ కోరగా.. ఉపాధ్యాయులు ఇద్దరూ తనకు లిఖిత పూర్వకంగా ఎలాంటి లీవ్ లెటర్ ఇవ్వలేదని, ఇద్దరిపై జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

తాగునీటి కోసం నిరసన



జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం పంచాయతీ తంగెళ్లగుంపులో మంచినీరు సరఫరా కావడం లేదంటూ గ్రామస్తులు బుధవారం జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. గత నాలుగు రోజుల నుంచి గ్రామానికి మంచి నీటి సరఫరా నిలిచినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఖాళీ బిందెలతో గ్రామస్తులు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. నీటి ఎద్దడి సమస్యపై పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై షాహీన తన సిబ్బందితో కలిసి నిరసన ప్రాంతానికి చేరుకున్నారు. గ్రామస్తులతో మట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని సర్దిచెప్పగా ఆందోళనను విరమించారు.

‘మిషన్ ఇంద్రధనుష్’ పరిశీలన



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి: మండలంలో నిర్వహిస్తున్న మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక పరిశీలించారు. బుధవారం మండలంలో ఆమె విస్తృతంగా పర్యటించి సబ్ సెంటర్‌లో మిషన్ ఇంద్రధనుష్‌లో భాగంగా మిగిలి పోయిన పిల్లలందరికీ సిబ్బంది టీకాలను వేస్తున్నారా.. లేదా అని తనిఖీ చేశారు. అనంతరం అన్నపురెడ్డిపల్లిలోని కేజీబీవీ విద్యాలయం, గిరిజన గురుకుల బాలికల కళాశాలలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో విద్యార్థినులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పూలమ్మ, ఆర్‌హెచ్‌ఎస్ ఇస్తేరురాణి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, డీపీఎంఓ వెంకటేశ్వరరావు, హెచ్‌వీ శారారాణి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక


దుమ్ముగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. 2023 మార్చి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కొండా సాయితేజ, పిలకా సాయి అలేఖ్య, పాయం పూజ, కల్లూరి అంజలి, షేక్ షబానా, యం.యువశ్రీ కృష్ణ సాయి, మర్రి రోహన్‌లు కేంద్ర విద్యాశాఖ ప్రతి సంవత్సరం అందించే జాతీయ ప్రతిభ ఉపకారవేతనాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఆయా విద్యార్థులకు ప్రిన్స్‌పాల్, కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

మణుగూరురూరల్: నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించిన ఆరుగురు విద్యార్థిని, విద్యార్థులు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ యూసఫ్ తెలిపారు.

మార్చి 2023 వార్షిక పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎం.లహరి, ఎం.వరలక్ష్మి, ఎస్.రితిక, ఎస్‌కె.అఫ్రిన్, ఎస్‌కె.కౌసర్, బి.భరత్‌లు స్కాలర్‌షిప్‌కు ఎంపికవ్వగా ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ములకలపల్లి: ములకలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు డీఐఈఓ, కాలేజీ ప్రిన్సిపాల్ సులోచనారాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు కాకి అనూష, షేక్ అజ్మతున్నీసా, ఈర్ల దివ్య, పొడుగు నాగశ్రీ, బత్తుల మౌనికలు ఎంపికైన వారిలో ఉన్నారు. పై చదువుల నిమిత్తం వీరు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందనున్నారు.

విరిగిపడిన చెట్టు తొలగింపు



జేసీబీతో చెట్టును తొలగిస్తున్న పోలీసులు

అశ్వారావుపేటరూరల్: జాతీయ రహదారిపై ఓ చెట్టు విరిగిపడి ప్రమాదకరంగా ఉండటంతో బుధవారం రాత్రి పోలీసులు తొలగించారు. స్థానిక టీవీఎస్ షోరూం సమీపంలో సత్తుపల్లి వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కన చెట్టు విరిగి, కొమ్మలు రహదారిపై పడ్డాయి. దాంతో కొంతమంది స్థానికులు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పెట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై పి.శ్రీకాంత్ జేసీబీ సాయంతో విరిగిపడిన చెట్టు పూర్తిగా తొలగించారు.

చదువులతో ముందుకు సాగాలి



బూర్గంపాడు: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు



మణుగూరురూరల్: చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది సర్వేశ్వరరావు



ములకలపల్లి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

బూర్గంపాడు: బాలికలు ఉన్నత చదువులను పూర్తిచేసి జీవితంలో ముందుకు సాగాలని, బాల్య వివాహాలను పూర్తిగా వ్యతిరేకించాలని భద్రాచలం జ్యుడిషయల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి వెంకటేశ్వర్లు అన్నారు. చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా కాంపెయిన్‌లో భాగంగా బుధవారం బూర్గంపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాహక్కు, మహిళా చట్టాలపై జడ్జి వివరించారు. కార్యక్రమంలో సంస్థ వాలంటీర్లు సంజీవరెడ్డి, కవిత, న్యాయవాదులు శారద, పేరాల వెంకటేశ్వర్లు, పామరాజు తిరుమలరావు, హెచ్‌ఎమ్ దూదా తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని 18 సంవత్సరాలు నిండిన యువతి, 21 సంవత్సరాలు నిండిన యువకులు మాత్రమే వివాహానికి అర్హులని మండల పారా లీగల్ వాలెంటీర్ పిలక వెంకట రమణ రెడ్డి సూచించారు. బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఫ్రీ ఇండియా కాంపెయిన్‌లో భాగంగా రేగుబల్లి ఆశ్రమ పాఠశాల, దుమ్ముగూడెం కాలేజీలో అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టబద్ధంగా 18 సంవత్సలు నిండిన అమ్మాయి, 21 సంవత్సరాలు నిండిన అబ్బాయి మాత్రమే వివాహం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రేగుబల్లి పాఠశాల హెచ్‌ఎం ధనసరి నాగమణి, కాలేజి ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: విద్యార్థి దశ నుంచి ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని లీగల్ ఎయిడ్ సెల్ న్యాయవాది అంకం సర్వేశ్వరరావు తెలిపారు. ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల లీగల్ ఎయిడ్ సెల్, ఆధ్వర్యంలో బుధవారం న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ సెల్ న్యాయవాది ఫోక్సో చట్టం, మనోవర్తితో పాటు బాలికలకు ఉపయోగపడే చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగశ్రీ, న్యాయవాదులు పోశం భాస్కర్, రుద్ర వెంకట్, ఉపాధ్యాయుడు ఇంద్రసేనారెడ్డి, లీగల్ ఎయిడ్ సెల్ సిబ్బంది ప్రవళిక, విద్యార్థినులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలకేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ ఆవాస విద్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికా సాధికారికపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు క్లబ్ అధ్యక్షుడు రాయల కేథారేశ్వరావు బహుమతులను అందజేశారు. క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాదరావు, శిశుమందిర్ ప్రధానాచార్యులు జగన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.